
సంపుటి :02 సంచిక :251 పేజీలు :04
వెల ₹5
అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
శనివారం 13, డిసెంబర్ 2025

## 1894 మందితో బందోబస్తు


- రెండో విడత పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

02






# అభ్యర్థి.. ప్రత్యర్థీ ఒకే పార్టీ !



## అధికార కాంగ్రెస్ పార్టీలో పల్లె పోరు కుంపటి

ఉమ్మ డి వరంగల్ జిల్లాలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు ఒక ప్రధాన అంశంగా మారింది. పార్టీ గుర్తులు లేకపోవడంతో అనేక చోట్ల సర్పంచ్ స్థానాల్లో కాంగ్రెస్ నుంచి ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు బరిలో నిలబడ్డారు. దీంతో పార్టీ కేడర్‌లో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ కేడర్ ఒక్కో గ్రామంలో రెండు, మూడు వర్గాలుగా విడిపోయింది. కొన్నిచోట్ల రెబల్ అభ్యర్థులు బరిలో ఉండగా, మరికొన్ని చోట్ల పార్టీ నుంచి సస్పెన్షన్ గురైన వారు సైతం బరిలో ఉన్నారు. ఈ అంతర్గత వర్గపోరు హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి తదితర జిల్లాల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. ఎమ్మె ల్యేలు ఈ విషయంలో జోక్యం చేసుకోకుండా తటస్థంగా ఉంటున్నారు. ఎవరు గెలిచినా చివరకు మన పార్టీలోనే కొనసాగుతారు కదా అని భావించి ప్రచారానికీ దూరంగా ఉంటున్నారు. మరోవైపు ఒకరి కంటే ఎక్కువ మంది బరిలో ఉండటం వల్ల ఓట్లు చీలి.... ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు లాభం చేకూర్చే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

02

- ఒక్కో సర్పంచ్ స్థానం నుంచి బరిలో ఒకరి కంటే ఎక్కువ మంది
- కొంతమంది రెబల్స్‌గా పోటీ చేస్తుండగా.. మరికొందరు మొండిగా బరిలోకి..
- పార్టీ గుర్తులపై జరిగే ఎన్నికలు కాకపోవడంతో అడ్వాంటేజీ
- గ్రామాల్లో రెండు, మూడు వర్గాలు విడిపోయిన కేడర్
- చూసీచూడటనట్లు ఎమ్మెల్యేల వ్యవహారం.. ప్రచారానికీ దూరం
- ఎవరు గెలిచినా మన పార్టీలో ఉంటారు కదా.. అనే ధీమా



# అంతటా మెస్సీ మేనియా!

05

## హైదరాబాద్ కు సాకర్ దిగ్గజం

తెలంగాణ రాజధాని సాకర్ దిగ్గజం లియోనెల్ మెస్సీ రాకతో ఉర్రూతలూగింది. 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా'లో భాగంగా శనివారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్న మెస్సీకి అభిమానులు ఘనస్వాగతం పలికారు. రాత్రి ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఫ్రెండ్లీ ఫుట్ బాల్ మ్యాచ్ ను తిలకించేందుకు వేలాది మంది క్రీడాభిమానులు తరలివచ్చారు. చిన్నారులతో జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచ్ లో సీఎం రేవంత్ రెడ్డి, మెస్సీ స్వయంగా పాల్గొనడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ హోరాహోరీ పోరులో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా మైదానంలోకి దిగి సందడి చేశారు. – అక్షరదర్బార్, హైదరాబాద్

- స్వాగతం పలికిన సీఎం రేవంత్‌రెడ్డి, వెల్‌కం టీం
- ఏఐసీసీ అగ్రనేత రాహుల్ కూడా మైదానంలోకి..
- ఉప్పల్ స్టేడియంలో హోరాహోరీగా ఫ్రెండ్లీ మ్యాచ్

# భార్యను హత్య చేసి వీడియో విడుదల

- తర్వాత భర్త కూడా ఆత్మహత్య
- భూపాలపల్లి జిల్లా సీతారాంపురంలో ఘటన
- భర్త సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్

02





# అభ్యర్థి.. ప్రత్యర్థీ
# ఒకే పార్టీ!

## అధికార కాంగ్రెస్ పార్టీలో పల్లె పోరు కుంపటి

- ఒక్కో సర్పంచ్ స్థానం నుంచి బరిలో ఒకరి కంటే ఎక్కువ మంది
- కొంతమంది రెబల్స్‌గా పోటీ చేస్తుండగా.. మరికొందరు మొండిగా బరిలోకి..
- పార్టీ గుర్తులపై జరిగే ఎన్నికలు కాకపోవడంతో అడ్వాంటేజీ
- గ్రామాల్లో రెండు, మూడు వర్గాలు విడిపోయిన కేడర్
- చూసీచూడటనట్లు ఎమ్మెల్యేల వ్యవహారం.. ప్రచారానికీ దూరం
- ఎవరు గెలిచినా మన పార్టీలో ఉంటారు కదా.. అనే ధీమా

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆదివారం రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ద్విముఖ పోరులా ఎన్నికలు కనిపిస్తున్నాయి. కానీ, ఈ విడత ఎన్నికల్లో ఒక వైచిత్రి కనిపిస్తున్నది. సర్పంచ్ స్థానాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకరు కంటే ఎక్కువ మంది అభ్యర్థులు బరిలో నిలుస్తుండటం కనిపిస్తున్నది. పార్టీ గుర్తులపై జరిగే ఎన్నికలు కాకపోవడంతో అభ్యర్థులు ఎవరికి వారు బరిలోకి దిగుతున్నారు. ఈ పరిస్థితి అనేక గ్రామాల్లో పార్టీ కేడర్‌ను సైతం రెండు, మూడు వర్గాలుగా చీల్చింది. తద్వారా పార్టీ అధికారిక మద్దతు ఎవరికి ఉందనే విషయంలో గందరగోళం నెలకొంది.

### - హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో

హనుమకొండ జిల్లాలో హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లె, అనంతసాగర్, మడిపల్లి, గుంటూరు పల్లి పంచాయతీల్లో సర్పంచ్ స్థానానికి ఇద్దరేసి చొప్పున కాంగ్రెస్ అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇదే జిల్లా పరకాల మండలంలోని వెల్లంపల్లి పంచాయతీలో మాజీ ఎంపీపీ తక్కలపల్లి స్వర్ణలత కాంగ్రెస్ రెబెల్ అభ్యర్థిగా పోటీ చేయగా, ఆమెపై పార్టీ సస్పెన్షన్ వేటు వేయడం అంతర్గత ఘర్షణకు దారి తీసింది. వరంగల్ జిల్లాలోనూ కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు పతాక స్థాయికి చేరింది. సంగెం మండలంలోని మొండ్రాయి, బిక్కోజినాయక్ తండా గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు ఇద్దరేసి చొప్పున కాంగ్రెస్ అభ్యర్థులు పోటీపడుతున్నారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే, గీసుకొండ మండలంలోని గీసుకొండ, మచ్చాపూర్, అర్జతండా, మనుగొండ, మరియాపురం వంటి పంచాయతీల్లో కాంగ్రెస్ నుంచి రెండు వేర్వేరు వర్గాలకు చెందిన మద్దతుదారులు అభ్యర్థులు బరిలో ఉన్నారు.

### - భూపాలపల్లి జిల్లాలో

భూపాలపల్లి జిల్లాలోనూ ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. టేకుమట్ల మండలం దుబ్యాల, కుందనపల్లి గ్రామాల నుంచి ఏకంగా ముగ్గురు కాంగ్రెస్ అభ్యర్థులు సర్పంచ్ స్థానానికి పోటీ చేస్తున్నారు. ఇదే మండలంలోని రామకృష్ణాపూర్ (వీ)లో ఇద్దరేసి కాంగ్రెస్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్ధారం, కొత్తపల్లి (ఎస్ఎం), కమలాపురం గ్రామాల్లో ఇద్దరేసి కాంగ్రెస్ అభ్యర్థులు పోటీకి దిగారు. చిట్యాల మండలం నైన్‌పాక పంచాయతీలో మాత్రం బీఆర్ఎస్ నుంచి ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉండటం గమనార్హం. మూడో విడత ఎన్నికలు జరిగే హనుమకొండ జిల్లా నడికూడ మండలం ధర్మారం పంచాయతీలోనూ కాంగ్రెస్ నుంచి ఇద్దరేసి అభ్యర్థులు బరిలో నిలిచారు.

### - ఎమ్మెల్యేలు ప్రచారానికి దూరం

ఒక్కో గ్రామంలో ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు బరిలో ఉండటంపై నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కూడా పెద్దగా జోక్యం చేసుకోవడం లేదు. ఎవరు ప్రచారానికి పిలిచినా వెళ్లడం లేదు. ఒకవర్గానికి మద్దతు ఇస్తే మరోవర్గం దూరమవుతుందని భావిస్తున్నారు. అలాగే ఎన్నికలో ఎవరు గెలుస్తారో తెలియదు కాబట్టి.. గెలిచిన తర్వాత వారు మన పార్టీలోనే ఉంటారనే ధీమాతో ఉంటున్నారు. ఇది ఒకవైపు అయితే.. మరోవైపు ఒకరి కంటే ఎక్కువ మంది బరిలో ఉండటం వల్ల ప్రతిపక్షాలకు లాభం చేకూర్చే ప్రమాదం ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.






## 1894 మందితో బందోబస్తు

- రెండో విడత పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: రెండో విడత పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ మండలాల్లో ఆదివారం జరిగే గ్రామ పంచాయితీ ఎన్నికల బందోబస్తు నిర్వహణ కోసం 1894 మంది పోలీసులను వినియోగించడం జరుగుతోందని, ఇందులో ముగ్గురు డీసీపీలు, ఐదుగురు అదనపు డీసీపీలతో పాటు, ఏసీపీలు 18, ఇన్ స్పెక్టర్లు 32, ఎస్ఐలు 120, ఏఎస్ఐ/హెడ్ కానిస్టేబుళ్లు 333, కానిస్టేబుళ్లు 1133, హోంగార్డ్స్ 258 మంది, వీరితో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్, బాంబ్ డిస్పోజబుల్ విభాగాలకు చెందిన సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఎన్నిక వేళ అదనపు డీసీపీ స్థాయి పర్యవేక్షణలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ నియమించడం జరిగిందని, ఎన్నికలు జరిగే ప్రతి మండలానికి ఒక ఏసీపీ స్థాయి అధికారి ఇంచార్జ్‌గా ఉంటారని వివరించారు. రూటు మొబైల్స్ టీంలు, షాడో పార్టీలు, ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ఎస్ఐ/ఏఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఓటర్ల లెక్కింపు సమయంలో పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, మొబైల్ పార్టీలు నిరంతరం పెట్రోలింగ్, పోలీస్ బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తారని సీపీ వెల్లడించారు. ఎన్నిక వేళ ఎవరైన ఎన్నికలకు విఘాతం కలిగించే విధంగా ఎలాంటి చర్యలకు పాల్పడినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇలాంటి చర్యలకు ఎవరైన పాల్పడుతున్నట్లు ఈ సమచారం అందితే తక్షణమే పోలీసులకు సమచారం అందించాలని సన్ ప్రీత్ సింగ్ ప్రజలకు సూచించారు.

### పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన సీపీ

గ్రామపంచాయతీ రెండో విడత ఎన్నికలను పురస్కరించుకొని గీసుగొండ, సంగెం, ఐనవోలు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బ్యాలెట్ పత్రాల పంపిణీ కేంద్రాన్ని సీపీ సన్ ప్రీత్ సింగ్ అధికారులతో కలిసి సందర్శించారు.




## బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి

అక్షర దర్బార్ శాయంపేట : బిఆర్ఎస్ ప్రభుత్వం హోయాంలోనే మండలంలో కోట్లాది రూపాయల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్సీ ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఈ సందర్భంగా శాయంపేట మండలంలోని సాధన పల్లి,రాజు పల్లి, కాట్రపల్లి, అప్పయ్య పల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం బిఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ షేక్ గౌస్,గజ్జల రాజు, జంగ సమ్మయ్య, మాధవ రావు, వెంకట్రావు, రాజు, ఎలిషా, మధు, భాస్కర్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## భార్యను హత్య చేసి వీడియో విడుదల

- తర్వాత భర్త కూడా ఆత్మహత్య
- భూపాలపల్లి జిల్లా సీతారాంపురంలో ఘటన
- భర్త సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్



అక్షరదర్బార్, గణపురం: భార్య మానసిక వేధింపులకు తాళలేక ఓ భర్త ఆమెను దారణంగా హత్య చేశాడు. అనంతరం తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం సీతారాంపురంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దంపతులు రామాచారి, భార్య సంధ్య అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వీరి మధ్య కొంతకాలం నుంచి తరచూగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తన భార్యను హత్య చేయాలని భర్త పథకం రచించాడు. అనుకున్నట్లుగానే ఆమెను ఉరివేసి హతమార్చాడు. అనంతరం తాను ఎందుకు హత్య చేశాడన్నది సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. భార్య వేధింపుల వల్లే ఈ ఘోరానికి పాల్పడుతున్నట్లు ఆ వీడియోలో భర్త తెలిపాడు. ఆ మనస్తాపంతోనే తాను కూడా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంటానని చెప్పాడు. తర్వాత ముందు చెప్పినట్లుగా ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## బాసని శాంతను గెలిపించండి



అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట అభివృద్ధి జరగాలంటే అనుభవజ్ఞులైన నాయకులు అవసరమని మాజీ ఎంపీపీ బాసని చంద్రప్రకాష్ అన్నారు. బాసని శాంతను సర్పంచ్‌గా గెలిపిస్తే కోతులు–కుక్కల బెడద నివారణ, డ్రైనేజీ, వీధిలైట్లు, రోడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. మండల ప్రజలు బ్యాట్ గుర్తుకు ఓటు వేసి బాసని శాంతను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# చిట్యాల సర్కిల్ లో ఎన్నికలు ప్రశాంతం

**: చిట్యాల సీఐ మల్లేష్**



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లేష్ నేతృత్వంలో మొగుళ్లపల్లి మండలంలో తొలి విడత పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా పూర్తయ్యాయి. 26 గ్రామపంచాయతీల్లో ఎన్నికల ముందు పోలీస్ కవాతులు, సున్నిత పోలింగ్ కేంద్రాల్లో అదనపు బందోబస్తుతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఎన్నికల సందర్భంగా 300 మంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు. రౌడీషీటర్లను బైండోవర్ చేయడం, అనుమానితులపై నిఘా, డబ్బు–మద్యం నియంత్రణకు రాత్రి తనిఖీలు నిర్వహించారు. సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే ప్రచారాలపై కట్టడి చేస్తూ, ఫేక్ న్యూస్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలి విడత విజయవంతం కావడంతో రెండో విడతలో చిట్యాల, టేకుమట్ల మండలాల్లోనూ ఇదే విధంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని సీఐ మల్లేష్ తెలిపారు.

# సూరత్ సదస్సుకు మేయర్

అక్షరదర్బార్, వరంగల్: ఈ నెల 13, 14న గుజరాత్ రాష్ట్రం సూరత్ నగరంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మేయర్ల 116వ కార్యనిర్వహక సమావేశానికి గుజరాత్ ముఖ్యమంత్రి భుపేంద్ర పటేల్ శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ తరపున మేయర్ గుండు సుధారాణి ప్రాతినిధ్యం వహించి సుస్థిర అభివృద్ధి, నగరంలో అమలు చేస్తున్న వినూత్న పారిశుద్ధ్య అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ సమావేశానికి సూరత్ (గుజరాత్) నగర మేయర్ దక్షేష్ మవానీ అధ్యక్షత వహించగా దేశం నలుమూలల నుంచి పలు నగరాల మేయర్లు హాజరయ్యారు. ఈ సమావేశంలో పట్టణాభివృద్ధి, నగర పరిపాలన, సుస్థిర అభివృద్ధి అంశాలపై చర్చలు జరిగాయి. ఆయా నగరాల మేయర్లు వివిధ అంశాలపై ఈ సదస్సులో మాట్లాడారు.





# 1,28,315 మంది ఓటర్లు

- **ఐదు మండలాల్లోని గ్రామాల్లో రెండో విడత పోలింగ్ కు ఏర్పాట్లు**
- **మధ్యాహ్నం 2 గంటల నుంచి సర్పంచ్, వార్డు స్థానాల ఓట్ల లెక్కింపు**
- **హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్**



అక్షరదర్బార్, హనుమకొండ: రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు హనుమకొండ జిల్లాలోని ఐదు మండలాల్లో ఆదివారం జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం వెల్లడించారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, హసన్ పర్తి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో, ఐనవోలు మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్, వేలేరు, పరకాల మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ కోసం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ద్వారా పోలింగ్ సామగ్రితో ఆయా మండలాల్లోని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది బయలుదేరి వెళ్లారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం జరగనున్న పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో రెండో విడతలో ఎన్నికలు జరుగుతున్న ఐదు మండలాల్లో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పోలింగ్ నిర్వహణకు పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**658 పోలింగ్ కేంద్రాలు**

హనుమకొండ జిల్లాలో రెండో విడతలో ఈనెల 14న ఐదు మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ధర్మసాగర్, హసన్ పర్తి, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల్లో మొత్తం ఓటర్లు 1,28,315 ఉన్నారు. ఇందులో పురుషులు 62692, మహిళలు 65621, ఇతరులు ఇద్దరు ఉన్నారు. ఐదు మండలాల్లో మొత్తం గ్రామ పంచాయతీలు 73, వార్డులు 694 ఉన్నాయి. రెండో విడతలో వార్డులు, సర్పంచ్ స్థానాలు కలిపి ఏకగ్రీవ గ్రామపంచాయతీలు 5 ఉన్నాయి. ఒక గ్రామపంచాయతీకి సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీలు 67 ఉండగా ఇందులో పోటీలో ఉన్న సర్పంచ్ అభ్యర్థులు 248 మంది కాగా పోటీలో ఉన్న వార్డు సభ్యుల అభ్యర్థులు 1442 మంది ఉన్నారు. మొత్తం వార్డులు 694 ఉండగా ఇందులో ఏకగ్రీవమైన వార్డులు 120 ఉన్నాయి. పోలింగ్ జరిగే వార్డు స్థానాలు 574 ఉన్నాయి. ఐదు మండలాల్లో మొత్తం పోలింగ్ కేంద్రాలు 658, ప్రిసైడింగ్ అధికారులు 658, ఓపివోలు – 961(మొత్తం పిఒ, ఓపిఓలు 1619), 23మంది మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు.







# పోలింగ్ కేంద్రం పరిసరాల్లో నిషేధాజ్ఞలు




అక్షరదర్బార్, హనుమకొండ: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల నిర్వహణలో భాగంగా ఈ నెల 14న వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల పరిధిలో జరిగే రెండవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ జరిగే ప్రాంతాల్లో శాంతి భద్రత పరిరక్షణ కోసం పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బీఎన్ఎస్, ఎస్ సీ ఆర్ పీసీ 163 ప్రకారం (144 సెక్షన్) ప్రజలు ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడం నిషేధించడం జరిగిందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రకటించారు. ఈ నిషేధం రేపు ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 14న రాత్రి 8 గంటల వరకు అమలులో వుంటుందని ఆయన వెల్లడించారు. ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

# అలియాబాద్ నా ఊపిరి..

- **కత్తెర గుర్తుకు ఓటేసి గెలిపించండి.. గ్రామ అభివృద్ధికి సహకరించండి**
- **సర్పంచ్ అభ్యర్థి శాతరాశి సనత్ కుమార్**



అక్షర దర్బార్, పరకాల: అలియాబాద్ గ్రామ వీధుల్లో అడుగడుగునా ఆత్మీయత వెల్లువెత్తింది. మీ ఇంటి బిడ్డగా, అన్నగా–తమ్ముడిగా ప్రతి గడప తొక్కుతూ శాతరాశి సనత్ కుమార్ ఓటు అడిగారు. రాజకీయ నాయకుడిగా కాదు... మీ మధ్య పుట్టి, మీతోనే పెరిగిన ఒక సాధారణ గ్రామస్తుడిగా ఆయన ప్రజలను హృదయపూర్వకంగా కోరారు. "మీ కష్టాలు నాకు తెలుసు... మీ కన్నీళ్లు నాకు కనిపిస్తున్నాయి. ఈ గ్రామం నా ఊపిరి. అలియాబాద్ అభివృద్ధి నా కల. మాటలకే కాదు, పనితోనే నేను మీకు న్యాయం చేస్తాను" అంటూ ఆయన మాట్లాడిన మాటలు ఓటర్ల గుండెల్ని కరిగించాయి.కత్తెర గుర్తు తన ఆశయం కాదు... గ్రామ భవిష్యత్తుకు ప్రతీక అని పేర్కొన్న సనత్ కుమార్, స్వచ్ఛమైన పాలన, నిజాయితీ, పారదర్శకతతో గ్రామాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఒక అవకాశం ఇవ్వాలని వేడుకున్నారు. అన్నగా ఆదరించి, తమ్ముడిగా ఆశీర్వదించి, మీ ఆశల ప్రతినిధిగా నిలబెట్టాలని కోరుతూ కత్తెర గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అలియాబాద్ ప్రజలకు ఆయన హృదయ పూర్వకంగా విజ్ఞప్తి చేశారు. గ్రామ బిడ్డ పిలుపుకు స్పందించిన ప్రజలు, "మా ఊరికి మనిషి కావాలి... మాట నిలబెట్టుకునే నాయకుడు కావాలి" అంటూ సానుకూలంగా స్పందించడం విశేషం.

# ఎన్నికల ప్రచారంలో గండ్ర

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండల కేంద్రంలో భూపాలపల్లి ఎంఎల్ఏ గండ్ర సత్యనారాయణ రావు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా శాయంపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి బాసాని శాంత – రవి బ్యాట్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో సర్పంచ్ గా గెలిపించాలని కోరారు. అనంతరం వివిధ పార్టీల నుండి నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.



# ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

**: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



అక్షర దర్బార్, నల్లబెల్లి: రెండో విడతలో ఆదివారం నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు–2025లో భాగంగా శనివారం దుగ్గొండి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలు, నల్లబెల్లి మండలంలోని సుమంగళీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి కౌంటర్‌ను తనిఖీ చేసి, ఎన్నికల సామాగ్రిని చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు వెంటనే తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాం రెడ్డి, ఇతర అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# నల్లబెల్లిలో పోలీసు కవాతు

అక్షర దర్బార్, నల్లబెల్లి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నల్లబెల్లి మండల కేంద్రంలో శనివారం పోలీసుల కవాతు నిర్వహించారు. వరంగల్ జిల్లా ఎస్పీ సున్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, దుగ్గొండి సీఐ సాయి రమణ మార్గదర్శకత్వంలో నల్లబెల్లి ఎస్సై వి. గోవర్ధన్ ఆధ్వర్యంలో ఈ కవాతు జరిగింది. ఎన్నికల సమేయంలో శాంతి భద్రతలను కాపాడటం, ఎన్నికల పరిస్థితులపై పర్యవేక్షణ కోసం పోలీసు అధికారులు, భద్రతా దళాలు కలిసి మండల కేంద్రంలో కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ సాయి రమణ మాట్లాడుతూ, ప్రజలు శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ పోలీస్ కవాతులో సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# టీఆర్ఆర్ఎస్ జిల్లా కార్యదర్శిగా సురావు బాబురావు

అక్షర దర్బార్, పరకాల: తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు ఆదే శాల మేరకు సురావు బాబురావును హనుమకొండ జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ ఆయనకు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య సలహాదారులు సుకినే సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు హింగే రవీందర్ పాల్గొన్నారు. సురావు బాబురావు నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు, జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, ముఖ్య సలహాదారు సుధాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు హింగే రవీందర్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




# నర్సక్కపల్లిలో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

అక్షర దర్బార్, పరకాల: నర్సక్కపల్లి గ్రామంలో బీఆర్ఎస్ మద్దతిచ్చిన సర్పంచ్ అభ్యర్థి కొడపాక ముత్యాలు ఐలయ్యతో పాటు వార్డు సభ్యులను భారీ మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం ఆయన గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగూర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ గత పది సంవత్సరాలుగా ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు చెక్ పెట్టాలంటే బీఆర్ఎస్ పార్టీనే గెలిపించాలని, అందరూ కత్తెర గుర్తుకు ఓటు వేసి కొడపాక ముత్యాలు ఐలయ్యను, వార్డు సభ్యులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలపై కాంగ్రెస్ ను నిలదీయాలి

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

అక్షర దర్బార్, పరకాల: సర్పంచ్ ఎన్నికల్లో ఓటు అడగటానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని ప్రశ్నించాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నడికూడ మండలం చర్లపల్లి, పులిగిల్ల, రాయపర్తి గ్రామాల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలంతా ఏకమై అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ అభ్యర్థులనే గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల, గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# ఎత్తులకు పైఎత్తులు

## రేపే రెండో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 564 సర్పంచ్ స్థానాలకు ఓటింగ్
- 4,928 వార్డు స్థానాలకు కూడా..
- బ్యాలెట్ బాక్సులు, ఎలక్షన్ సామగ్రితో గ్రామాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది
- తెల్లవారితే ఓటింగ్ షురూ.. ప్రలోభాలకు తెరతీసిన అభ్యర్థులు
- రిజర్వ్ స్థానాల్లో ఓటుకు రూ.వెయ్యి..
- జనరల్ స్థానాల్లో రూ.2 వేల వరకు పంపిణీ
- పలు గ్రామాల్లో మద్యం, చికెన్, చీరల అందజేత
- గెలిచి తీరాల్సిందే.. అన్న లక్ష్యంతో ప్రలోభాలు

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆదివారం రెండో విడత పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ జరుగనుంది. ఆరు జిల్లాల పరిధిలోని మొత్తం 564 సర్పంచ్ స్థానాలు.. 4,928 వార్డు స్థానాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగనుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు కార్యక్రమం మొదలుకానుంది. మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల నుంచి పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, పత్రాలు తీసుకుని, తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు శనివారం చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు  ఏర్పాటు చేశారు.

### - పోటాపోటీగా మద్యం, చీరెల పంపిణీ

పల్లె పల్లెనా మద్యం ఏరులై పారుతున్నది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని విచ్చలవిడిగా మద్యం పంపిణీ చేస్తున్నారు. అలాగే మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పోటాపోటీగా చీరెలు పంపణీ చేస్తున్నారు. ముఖ్యంగా అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థులు ప్రత్యర్థుల కంటే ఎక్కువ చీరెలు పంపిణీ చేస్తున్నారు. ఎందుకంటే రాష్ట్రప్రభుత్వం పంపిణీ చేసిన ఇందిరమ్మ చీరెలు కేవలం మహిళ సమాఖ్య సంఘాల సభ్యుల వరకే చేరాయి. దీంతో మిగతా వారు గుర్రుగా ఉన్నారు. దీంతో ఆ పార్టీ అభ్యర్థులు బయట మార్కెట్‌లో ఎక్కువ ధరకు చీరెల కొని మరీ చీరెలు పంపిణీ చేస్తున్నారు. అభ్యర్థులు కేవలం ఒక చీరెతో సరిపెట్టుకోకుండా, ఇంటింటికీ ఒక చీరె, ఒక మద్యం సీసా పంపిణీ చేస్తున్నారు. కొన్నిచోట్ల కిలో కోడి కూర కూడా పంపిణీ చేయడం గమనార్హం. మద్యం బాటిళ్లు కూడా ఓటర్లు సాదాసీదా బ్రాండ్లు అడగడం లేదని, తాము రోజూ తీసుకునే బ్రాండ్ కంటే.. ఎక్కువ ధర ఉండే బ్రాండ్లే అడుగుతున్నారని అభ్యర్థులు చెప్తున్నారు.

### ఏ మండలాల్లోనంటే..

హనుమకొండ జిల్లాలోని పరకాల, హసన్ పర్తి, ఐనవోలు, ధర్మసాగర్, వేలేరు మండలాల్లో, వరంగల్ జిల్లాలోని సంగెం, గీసుకొండ, దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల, టేకుమట్ల, భూపాలపల్లి, పలిమెల మండలాల్లో, ములుగు జిల్లాలోని వెంకటాపురం, ములుగు, మల్లంపల్లి మండలాల్లో, జనగామ జిల్లాలోని తరిగొప్పుల, నర్మెట్ట, జనగామ, బచ్చన్నపేట మండలాల్లో, మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడూరు, దంతాలపల్లి, నర్సింహులపేట, బయ్యారం, గార్ల, తొర్రూరు, పెద్దవంగర మండలాల్లోని గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలు, వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి.

### - ప్రలోభాలకు తెర తీసిన అభ్యర్థులు

ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. తెల్లారితే పోలింగ్ ప్రారంభం కావడంతో అభ్యర్థులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఎంత ఖర్చైనా ఫర్వాలేదు.. అనుకుని ఆస్తి అమ్మి, అప్పులు చేసి, వడ్డీలకు తెచ్చి మరీ గ్రామాల్లో డబ్బులు పంచుతున్నారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో రిజర్వ్ స్థానాల్లో అభ్యర్థులు రూ.500 వరకు పెంచగా, రెండో విడత నాటికి వాళ్లు ఒక్కో ఓటర్‌కు పంచే కనీస సొమ్ము రూ.వెయ్యికి చేరింది. ఇక జనరల్ స్థానాల్లోనైతే మొదటి విడతలో ఒక్కో ఓటర్‌కు రూ.2 వేల వరకు పంపిణీ చేయగా, రెండో విడత నాటికి ఆ కాస్త మొత్తం రూ.2 వేల రూ.3 వేల వరకూ జరుగుతుంది.

# నడికూడలో కాంగ్రెస్ ప్రచార హోరు

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరందుకుంది. కంఠాత్మకూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కొనుగంటి తిరుపతి, వార్డు మెంబర్ల గెలుపు కోసం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని ఆయన తెలిపారు. రామకృష్ణాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పెండ్లి లక్ష్మీ రాజు, వార్డు మెంబర్లకు మద్దతుగా రేవూరి ప్రకాశ్ రెడ్డి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.



# 82,728 మంది ఓటర్లు




- రెండో విడత పోలింగ్ కు 1757 మంది సిబ్బంది
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వెల్లడి




అక్షరదర్బార్, భూపాలపల్లి: గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం చిట్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14న జరుగనున్న పోలింగ్ నిర్వహణకు పంపిణీ చేస్తున్న మెటీరియల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండో విడత జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చిట్యాల, భూపాలపల్లి, టేకుమట్ల, పలిమెల మండలాల్లో 82,728 మంది ఓటర్లు తమ హక్కు వినియోగించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వయో వృద్ధులు, దివ్యాంగుల కొరకు వీల్ ఛైర్లు అందుబాటులో ఉంచాలని సంక్షేమ అధికారికి సూచించారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్తి అవుతుందని, తదుపరి 2 గంటల నుండి లెక్కింపు ప్రారంభించాలన్నారు. లెక్కింపు పూర్తి అయిన తదుపరి సాధారణ పరిశీలకుల అనుమతితో గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించాలని స్పష్టం చేశారు. పోలింగ్ నిర్వహణ, తదుపరి ఓట్లు లెక్కింపులో ఎలాంటి పొరపాటుకు అవకాశం లేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

### 1757 మంది సిబ్బంది

పోలింగ్ అధికారులు 833, అదనపు (రిజర్వ్) సిబ్బంది 924, మొత్తం పోలింగ్ సిబ్బంది 1757 మంది ఆదివారం జిల్లాలో పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహిస్తారని కలెక్టర్ రాహుల్ శర్మ వెల్లడించారు. పర్యవేక్షణ కోసం నలుగురు జిల్లా స్థాయి అధికారులు,13 మంది జోనల్ అధికారులు, 17 మంది రూట్ అధికారులు, 26 మంది మైక్రో అబ్జర్వర్లు, 33 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ నిర్వహణ కోసం మొత్తం 769 బ్యాలెట్ బాక్సులు వినియోగిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఓటరు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించాలని ఆయన సూచించారు.

# అంతటా మెస్సీ మేనియా!

- హైదరాబాద్ కు సాకర్ దిగ్గజం
- స్వాగతం పలికిన సీఎం రేవంత్ రెడ్డి, వెల్ కం టీం
- ఏఐసీసీ అగ్రనేత రాహుల్ కూడా మైదానంలోకి..
- ఉప్పల్ స్టేడియంలో హోరాహోరీగా ఫ్రెండ్లీ మ్యాచ్




అక్షరదర్బార్, హైదరాబాద్: అర్జెంటీనా సాకర్ దిగ్గజం లియోనెల్ మెస్సి 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా' టూర్‌లో భాగంగా శనివారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఆయనకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మెస్సీ ప్రత్యేక వాహనంలో గ్రీన్ చానల్ మధ్య ఎయిర్ పోర్టు నుంచి నేరుగా ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లారు. అక్కడ వందమందితో ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్‌లో పాల్గొన్నారు. సాయంత్రం 6.30 గంటలకు ఆయన టీం ఉప్పల్ స్టేడియానికి చేరుకుంది. మెస్సీ పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. ముందుగా 20 నిమిషాల పాటు ఎగ్జిబిషన్ మ్యాచ్ జరిగింది. ఏడుగురు చొప్పున సింగరేణి ఆర్ఆర్-9, అపర్ణ మెస్సి ఆల్ స్టార్స్ జట్ల తరఫున చిన్నారులు ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడారు. చివరి అయిదు నిమిషాల ఆటలో సీఎం రేవంత్‌రెడ్డి, సాకర్ దిగ్గజం మెస్సి పాల్గొన్నారు. మ్యాచ్ అనంతరం చిన్నారులకు మెస్సి చిట్కాలు చెప్పారు. షూటౌట్ విజేతలకు మెస్సి బహుమతులు అందజేశారు. 7.50 గంటలకు ఉప్పల్ స్టేడియంలో మెస్సి-గోట్ ఫుట్‌బాల్ మ్యాచ్ ప్రారంభమైంది. 8.06కి సీఎం రేవంత్‌రెడ్డి, మెస్సి మైదానంలోకి దిగారు. రాత్రి 8.08 గంటలకు రోడ్రిగో, లూయిస్ సువారెజ్ మైదానంలోకి వచ్చారు. రాత్రి 8.13 గంటలకు



మ్యాచ్ పెనాల్టీ షూటౌట్ జరిగింది. రాత్రి 8.18కి మైదానంలోకి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వచ్చారు.

### - సీఎం అదే జోరు కొనసాగేనా..?

చివరి ఐదు నిమిషాల సాకర్ దిగ్గజం మెస్సీతో మ్యాచ్‌లో సీఎం రేవంత్ జోరు కొనసాగిస్తారా..? అనేది చూడాలి. రాష్ట్ర ఫుట్‌బాల్ ప్లేయర్లను పరుగులు పెట్టించిన సీఎం రేవంత్ ఎలా మెస్సీని దీటుగా ఎదుర్కొంటారో చూడాలి. మెస్సీతో గేమ్ అంటే మామూలు కాదు.. ఆ విషయం రేవంత్‌కు తెలుసు. అందుకే అంత ప్రాక్టీస్ చేశారు సీఎం. ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం టెక్నికల్‌గా పుంజుకుని మరీ తన వార్మప్ మ్యాచ్‌లను కొనసాగించారు రేవంత్. ఒకవేళ పొరపాటున మెస్సీతో గేమ్‌లో రేవంత్ పైచేయి సాధించారంటే ఏమవుతుందనే ఆసక్తి అభిమానుల్లో కనపడింది. చాలా స్వల్ప సమయం పాటు జరిగే మ్యాచ్ కాబట్టి పెద్దగా అంచనాలు ఉండకపోవచ్చు. కానీ ఆ ఐదు నిమిషాల్లోనే రేవంత్ అద్భుతం చేసి మెస్సీని ఆశ్చర్యపరుస్తాడా? అనేది ఫుట్‌బాల్ అభిమానుల్లో మ్యాచ్ కు ముందు చర్చ సాగింది.



# ఓటర్లను ఆకట్టుకునేలా గ్రీన్ పోలింగ్ కేంద్రాలు

### - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ జిల్లాలో రెండో విడతలో ఆదివారం జరగనున్న ఎన్నికలకు పలు పోలింగ్ కేంద్రాలను గ్రీన్ పోలింగ్ కేంద్రాలుగా సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో రెండో విడతలో ఈ నెల 14న ఆదివారం జిల్లాలోని నాలుగు మండలాల్లో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రతి మండలానికి రెండు చొప్పున హరిత (గ్రీన్) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రీన్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను ఆకుపచ్చని తోరణాలతో స్వాగతం పలుకుతూ గ్రీన్ మ్యాట్లు వేశారు. ఈ పోలింగ్ కేంద్రాల ముందు ఓటర్లను ఆకట్టుకునే విధంగా ముగ్గులు వేశారు. వయో వృద్ధులు, దివ్యంగుల సౌకర్యం కొరకు విల్ చైర్ లను ఏర్పాటు చేశారు. ఈ మేరకు గీసుకొండ మండలం గీసుకొండ, గంగదేవిపల్లి పోలింగ్ కేంద్రాలు, దుగ్గొండి మండలం వెంకటాపూర్, దేశాయిపల్లి పోలింగ్ కేంద్రాలు, నల్లబెల్లి మండలం నల్లబెల్లి సుమంగళి ఫంక్షన్ హాల్, నందిగామ పోలింగ్ కేంద్రాలు, సంగెం మండలం సంగెం జడ్పీ హై స్కూల్, మొండ్రాయి పోలింగ్ కేంద్రాలు ఓటర్లను ఆకట్టుకునేలా హరిత పోలింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దినట్లు కలెక్టర్ తెలిపారు. ఆహ్లాదకరమైన, వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని ఓటర్లను కలెక్టర్ కోరారు.

# రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి



అక్షరదర్బార్, స్టేషన్ ఘణపురం: జనగామ జిల్లా స్టేషన్ ఘణపురం మండలం రాఘవాపూర్ వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో బైక్ పై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో బుర్ర కళ్యాణ్ (27), బుర్ర నవీన్ (27) ఉన్నట్లు సమాచారం. హైదరాబాద్ నుంచి 2వ దశ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌లో ఓటు వేయడానికి బైక్ పై తమ స్వగ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామస్తులని తెలిసింది.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915